క్లుప్తంగా

ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టండి



వరగలి రోడ్డుపై చైన్‌లతో ఉన్న హిటాచీ

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై రైతులు ట్రాక్టర్‌లకు కేజ్‌వీల్స్ వేసుకుని ప్రయాణిస్తే ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే వారికి జరిమానా విధించాల్సి ఉంది. అయితే ఇటీవల కాలంలో ఆ శాఖాధికారులు రోడ్డు భద్రత విషయాన్ని గాలికి వదిలేశారు. ఈ క్రమంలోనే మంగళవారం వరగలి గ్రామానికి వెళ్లే రహదారిపై ఓ హిటాచీ (చైన్ ఉండేది) సుమారు కిలోమీటరు దూరం ప్రయాణించడంతో ఆ రోడ్డు ధ్వంసమైంది. ఇప్పటికే వరగలి రహదారి గుల్ల గుల్ల కాగా ఉన్న కొద్దిపాటి రోడ్డునైనా కాపాడాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

పంచాయతీ దుకాణాలకు వేలం నిర్వహించాలి

కోట: బజారువీధిలోని పంచాయతీ దుకాణాలకు వేలం నిర్వహించాలని సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ గాది భాస్కర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం కోట పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 పంచాయతీ దుకాణాలు ఉండగా వాటిలో వ్యాపారాలు సాగిస్తున్న వారు అద్దె చెల్లించకుండా ఉండడంపై అన్నీ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు దీనికి వైఎస్ఆర్ సీపీ నాయకులను బాధ్యులను చేస్తూ విమర్శలు చేయడా న్ని ఖండిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని పంచాయతీ దుకాణాలకు వే లం నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, కిరణ్, రఫీ, రవి పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయాలని నిరసన



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన

పెళ్లకూరు: మండలంలోని కానూరు రాజుపాళెం గిరిజనులకు న్యాయం చేయాలని మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి ముకుంద ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. శిరసనంబేడు రాజుపాళెం గ్రామానికి చెందిన ఓ ఇటుక బట్టీ వ్యాపారి గిరిజనులతో అమానుషంగా ప్రవర్తించిన తీరును ఆయన ఖండించారు. చేసిన కష్టానికి గిరిజనులకు డబ్బులు ఇవ్వకుండా పాతబాకీ పేరుతో కాళ్లు, చేతులు కట్టేసి రోజంతా ఎండలో నిలబెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ విషయమై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. గిరిజనులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట బాధిత గిరిజనులు ఉన్నారు.

అక్కరపాకలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

దొరవారిసత్రం: అక్కరపాక గ్రామంలో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నవజీవన్ ఆర్గనైజన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్, హెచ్ఐవీపై ర్యాలీ చేపట్టారు. అనంతరం మీకు తెలుసా కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఏవిధంగా సోకుతుంది, వాటి లక్షణాలు, సోకితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, సిబ్బంది ఐశ్వర్య, నాగార్జునమ్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం యాకసిరి ఎగువ గిరిజన కాలనీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు పెళ్లకూరు మండలం పునబాక గ్రామానికి చెందిన బండి మంజులమ్మ అనే మహిళ వాకాడులో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఓ యువకుడి బైక్‌లో బయల్దేరింది. ఈ క్రమంలో యాకసిరికి చెందిన ఓ యువకుడు ఎదురుగా బైక్‌లో వస్తూ మంజులమ్మ ఉన్న బైక్‌ను గిరిజన కాలనీ వద్ద ఢీ కొన్నాడు. దీంతో ఆమె కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనంలో ఆమెను నాయుడుపేటకు ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఆమెను నెల్లూరుకు తరలించారు. పోలీసులు వివరాలను సేకరించి విచారిస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

తడ: కుటుంబ సభ్యులు ఇంటి మిద్దెపైన నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంట్లో ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన 9.5 సవర్ల బంగారు నగలు, 65 వేల నగదును దోచుకెళ్లారు. ఎస్‌ఐ పీ.నరశింహారావు కథనం.. తడ బీసీ కాలనీలో ఉంటున్న లొక్కు చెంచురత్నం తన భార్యతో కలిసి సోమవారం రాత్రి డాబా పైన నిద్రించారు. మంగళవారం ఉదయం లేచి చూసే సరికి ఇంటి గేటు, తలుపులు తీసి.. తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. బీరువాలోని దుస్తులను చిందరవందర చేసి ఉన్నారు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నగదు, నగల వివరాలపై ఆరాతీశారు. కేసు దర్యాప్తులో ఉంది.



ట్రిప్పు ఇసుక కోసం తప్పని తిప్పలు

మావిళ్లపాడు గ్రామ పరిధిలో ఖాళీగా మారిన ఇసుక స్టాక్ పాయింట్

మేము అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి మూడునెలలు గడుస్తున్నా ఉచిత ఇసుక మాట ఊసే లేదు. ఇసుక రీచ్‌లు పెట్టలేదు. తూతూమంత్రంగా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడా ఇసుక దొరక్కపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- ఖాళీ అయిన మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్
- ఇసుక లభించక వినియోగదారులకు ఇబ్బందులు

దొరవారిసత్రం: గత ప్రభుత్వం దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు గ్రామ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు ఇసుకను అందుబాటులో ఉంచింది. ఇబ్బందులు లేకుండా ఎవరికి ఎన్ని ట్రక్కులు కావాలన్నా సరఫరా చేసేవారు. ఎన్నికల ముందు తరలించిన 465 మెట్రిక్ టన్నుల ఇసుకనే టీడీపీ అధికారంలో వచ్చిన తర్వాత పంపిణీ చేసింది. తర్వాత ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించలేదు. కనీసం రీచులను కూడా ఏర్పాటుచేయలేదు. ఎవరిని అడిగినా ప్రభుత్వం నుంచి ఏలాంటి ఉత్తర్వులు రాలేదు? మేము ఏమి చేసేది? అని అధికారులు చెప్పడంతో భవన నిర్మాణదారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కార్మికులకు ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం తిప్పలు పడుతున్నారు. కూటి కోసం నగరాలకు వలస వెళ్లాల్సి వస్తోందని భవన నిర్మాణ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాయుడుపేటలో ఇసుక రీచ్ ఊసే లేదు

నాయుడుపేట మండలంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు రెండు నెలలుగా చెబుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు రీచ్ ఏర్పాటు ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, పెళ్లకూరు, డీవీ సత్రం తదితర మండలాల్లో ఆయా ప్రాంతాల్లోని నదుల్లోని ఇసుకను టీడీపీ నేతలు అధికారం అండతో అడ్డదారిలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వారు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో వినియోగదారులు కొనుగోలు చేయలేక నానా అగచాట్లు పడుతున్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలనే ఉద్దేశంతో అధిక ధరలు చెల్లించి ఇసుకను కొనుగోలు చెయ్యక తప్పడం లేదని కొందరు వాపోతున్నారు. ఇసుక సమస్య ఎన్నటికి తీరుతుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాత్రూమ్ నిర్మాణం ఆగిపోయింది



అందుబాటులో ఇసుక లేకపోవడంతో బాత్రూమ్ నిర్మాణం ఆగిపోయింది. మావిళ్లపాడులోని స్టాక్ పాయింట్‌లో ఇసుక ఉన్న సమయంలో రోజుల తరబడి తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ట్రాక్టర్ ఇసుక తోలుకోలేకపోయాము. అందుబాటులో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేస్తే ఇబ్బందులు తీరుతాయి.

- ఎస్ వీరయ్య, ఆనేపూడి గ్రామం

ఎక్కడి నిర్మాణాలు అక్కడే..



ఇసుక దొరక్కపోవడంతో తొగరాముడి పంచాయతీ పరిధిలో పలు ఇళ్ల నిర్మాణాలు, వివిధ రకాల కట్టడాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇసుక కోసం వినియోగదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు వలస వెళుతున్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని ఇసుక సమస్య తీర్చాలి.

- ఆర్ ప్రసాద్‌నాయుడు, సర్పంచ్, తొగరాముడి గ్రామం

వైఎస్ఆర్ సీపీ నేత మృతి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ తంబ సుకన్య భర్త, వైఎస్ఆర్ సీపీ నేత జగదీష్ గుండెపోటుకు గురై మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ మేరకు జగదీష్ మృతిపై పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తడ: జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తడకండ్రిగకు చెందిన ఉద్దండి చంద్రయ్య(54) మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ పి.నరసింహారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాల ప్యాకెట్ కోసం సైకిల్‌పై తడ బజారుకు వెళ్లిన చంద్రయ్య ఇంటికి తిరుగు పయనమయ్యాడు. జాతీయ రహదారి పక్కన వస్తున్న సమయంలో నిప్పో పరిశ్రమ సమీపంలో చెన్నై వైపు నుంచి వెనుకగా వచ్చిన ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కిందపడ్డ చంద్రయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన సూళ్లూరుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఆయన్ను చెన్నై తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు విచారిస్తున్నారు.

విద్యుత్ మోటారు చోరీ

పెళ్లకూరు: మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన వట్టికుంటల శేఖర్‌నాయుడుకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటారు చోరీ అయ్యిందని మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పొలాల్లో సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటారు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి మేట్‌ల ఇష్టారాజ్యం

చిల్లకూరు: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపాధి హామీ మేట్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఇటీవల మండలంలో 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొగించినట్లు మౌఖిక ఆదేశాలిచ్చారు. దీంతో అధికార పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లో వారికి అనుకూలంగా ఉన్న మేట్లను నియమించుకున్నారు. వారిలో కొంత మంది రెండు రోజులుగా పనులు పెడుతున్నప్పటికీ కూలీలు పనులకు పూర్తి స్థాయిలో హాజరు కావడం లేదు. నాయకుల అండ చూసుకుని కొత్తగా బాధ్యతలు చేపట్టిన మేట్‌లు తమ ఇష్టం వచ్చిన చోట పనులు చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు. అడిగితే మా ఇష్టం అని సమాధానమిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం మండల తీర ప్రాంతంలోని మోమిడిలో పని ఒక చోటు చేయాల్సి ఉండగా మేట్ కూలీలతో అక్కడ ఫొటోలు దిగి, మరో చోట పనులు చేయించారు. ఆ ప్రాంతంలోని భూముల్లో పనులు ఎలా చేస్తారనే విషయం అడిగేందుకు స్థానిక సర్పంచ్ లావణ్య అక్కడికి వెళ్లగా కూలీలు అప్పటికే వెళ్లిపోయారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామని అన్నారు. ఈ విషయమై ఉపాధి హామీని ఏపీఓ గిరిని వివరణ కోరగా మేట్‌కు టెక్నికల్ అసిస్టెంట్ పని ప్రాంతాన్ని కచ్చితంగా చూపి అక్కడే పనులు చేయించాలని అన్నారు. దీనిపై విచారణ చేస్తామని తెలిపారు.

23న ఉపాధి హామీ గ్రామసభలు

తడ: ఈ నెల 23వ తేదీన మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సభల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. గ్రామ సభల్లో సీసీ రోడ్లతోపాటు రెగ్యులర్ పనులకు సంబంధించి తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించుకోవాలని తెలిపారు. అదే విధంగా గ్రామసభలకు మండలంలోని అన్ని శాఖల సిబ్బంది పాల్గొనాలని సూచించారు. సభలకు ఎక్కువ మంది ప్రజలు, ఉపాధి హామీ వేజ్ వర్కర్లు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు.

నేడు చీరల వేలంపాట

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద బుధవారం అమ్మవారికి అలంకరించిన చీరలను వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ శశాంక్ తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పోలేరమ్మతో పాటు ఆలయ ఆవరణ మొత్తం చీరలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ చీరలకు వేలం పాటలు నిర్వహించి భక్తులను అందిస్తామన్నారు. గత శుక్రవారం అమ్మవారికి అలంకరించిన గాజులను మాత్రం భక్తులకు ఉచితంగా అందజేస్తామన్నారు. గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సారథ్యంలో బుధవారం పోలేరమ్మ ఆలయ హుండీ నగదు కూడా లెక్కింపు చేస్తున్నట్లు ఈఓ వెల్లడించారు.

ఆదర్శ పాఠశాలలో తనిఖీలు

దొరవారిసత్రం: మావిళ్లపాడు గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలను స్థానిక తహసీల్దార్ శైలకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు తాగేందుకు శుద్ధి చేసిన నీళ్లు, వాడుకకు నీటి వసతిని పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్ల వసతి, భోజన వసతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకండా మెనూ ప్రకారం భోజనం పెట్టడంపై ఆరాతీశారు. ఆమె వెంట డీటీ గోపినాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుమలత ఉన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన

సైదాపురం: స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ శ్రావణి, నిత్య ప్రశాంతి పలు సూచనలు సలహాలు అందించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, నిల్వ నీటిని తొలగించి రెండు గంటలు ఆరబెట్టాలన్నారు. పూలకుండీలు, టీ కప్పులు, కొబ్బరి చిప్పల్లోని నీటిని పారబోయాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సొరకాయలశెట్టి, రాపూరు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

రాపూరు: మండలంలోని కండలేరు గురుకులం, వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కండలేరు గురుకులం ప్రిన్సిపల్ భారతి, వైద్యసిబ్బంది లింగమూర్తి, శిరీష, లక్ష్మి, శ్రావణి, గౌరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లిచ్చి ఆదుకోండయ్యా!

ఓజిలి: గుక్కెడు నీళ్లిచ్చి ఆదుకోండయ్యా..! అంటూ ఓజిలి గ్రామం ముస్లి కాలనీకి చెందిన మహిళలు అధికారులను అభ్యర్థించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ ముస్లిం కాలనీలో వందకు పైగా కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అయితే గత ఇరవై రోజుల కిందట శివాలయం వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతుకు గురైందని, దాంతో కాలనీకి తాగునీటి సరఫరా ఆగిపోయిందని వాపోయారు. గుక్కెడు నీటి కోసం బిందెలెత్తుకుని ఇతర ప్రాంతాలకెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకవర్గం తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేసే ప్రయత్నంలో కొందరు టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సమస్యను అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించాలి

గూడూరు రూరల్: పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు పాడి రైతులు వైద్యుల సలహాలను పాటించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సురేష్ తెలిపారు. పట్టణంలోని ఒకటి, రెండు వార్డులతోపాటుగా, కొండాగుంట, చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలలో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. పట్టణ, రూరల్ ప్రాంతాలలో మంగళవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాలలో ఆయన 298 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తికి సంబంధించిన పూర్తి వివరాలను వైద్యుల ద్వారా తెలుసుకుని పాడి పశువులను సంరక్షించుకోవాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా వార్షిక, బహుళ వార్షిక పంటలను సాగు చేసుకునేందుకు రైతులకు రాయితీ ఇస్తున్నారని వీటిని సాగు చేసుకుని పచ్చి మేత ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. అలాగే పశువులకు ఉపాధి పథకం ద్వారా రాయితీపై షెడ్‌లు ఇస్తున్నారని వీటిని కూడా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



టీకాలు వేస్తున్న పశు వైద్యులు


ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని క్రాస్‌రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దళిత బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సమావేశంలో దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు కె.సహదేవయ్య మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. ఏపీడీఎస్ అధ్యక్షుడు ఇ.రామచంద్రయ్య, గోపాల్, దంపెల్ల రామకృష్ణ, మంగలపురి సురేష్, దాసరి వంశీ, పంజాం ధనుంజయ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏలూరు రాజేంద్ర, పల్లిపాటి రవి, మణి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, కౌన్సిలర్లు నారి శేఖర్, ఆరి శంకరయ్య, మునెయ్య, సుధాకర్, రామకృష్ణ, బాబు, పల్లిపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు

భూ వివాదంపై విచారణ



బూదూరులో భూ సమస్యపై విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం: బూదూరు గ్రామంలో ఏర్పడిన భూ సమస్యపై మంగళవారం తహసీల్దార్ శైలకుమారి, డీటీ గోపినాథ్‌రెడ్డి విచారణ చేపట్టారు. గత కొంత కాలంగా బూదూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్లులోని 20 ఎకరాల పైబడి పేదల భూములను ఓ టీడీపీ నాయకుడు, రియల్టర్ రికార్డులను తారుమారు చేశారు. అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో ఫోర్జరీ సంతకాలతో పలువురి భూములను రిజిస్ట్రేషన్ చేసుకుని, అమ్మేశాడు. విషయం తెలుసుకున్న రైతులు తమకు న్యాయం చేయాలంటూ రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. స్పందించిన సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో భూసమస్యపై విచారణ చేపట్టి, రైతుల నుంచి వివరాలు రాబట్టారు. విచారణ చేపట్టిన నివేదికను ఆర్డీఓ, కలెక్టర్‌లకు పంపి అనంతరం రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలియజేశారు. మండల సర్వేయర్ రామారావు, వీఆర్ఓ మురళీధర్ పాల్గొన్నారు.

కండలేరులో 5.854 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 5.854 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 90, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.